విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయలో రవ్వలగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో స్థానిక పట్టాసి ఫౌండేషన్ సభ్యులు టెన్త్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం టెన్త్ ఎగ్జామ్ రాయడానికి కావలసిన పెన్నులు, అట్టలు, పెన్సిల్, అరేజర్ తదితర సామాగ్రిని అందజేశారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులందరూ భయాన్ని వీడి పరీక్షలకు సంసిద్ధులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు, రవ్వలగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌బి కెందు, పట్టాసి ఫౌండేషన్ ప్రతినిధులు పట్టాసి నారాయణ, జగ్జీవన్ రావ్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం నాగంనాయుడు, ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు ప్రశాంత్ పాల్గొన్నారు.

సామగ్రిని ఇస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అడ్డ పిక్కలు.. గిరిజనుల జీవనాధారం

▸▸ప్రారంభమైన సీజన్ ▸▸వారపు సంతల్లో విక్రయాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రతి ఏటా ఈ సీజన్ లో గిరిజనలకు అడ్డచెట్టులో కాచే అడ్డపిక్కలు మంచి ఆదాయ వనరుగా చెప్పుకోవచ్చు. మార్చి ప్రారంభం నుండి ఏప్రిల్ వరకు రెండు నెలలు అడ్డ పిక్కలు కేజీ రూ.100 నుంచి 150 వరకు అమ్ముతూ మంచి జీవనాధాయం పొందుతారు. అడవిలోకి వెళ్లి అడ్డ చెట్టులో కాచే అడ్డకాయలను గిరిజనులు సేకరిస్తారు. ఇంటికి తీసుకొచ్చిన అడ్డ కాయలను కాల్చి లోపల ఉన్న అడ్డపిక్కలను సేకరించి వారపు సంతల్లో విక్రయించి వచ్చిన డబ్బులతో గిరిజనులు జీవనం కొనసాగి స్తుంటారు. అడ్డ చెట్టు (అడ్డ తీగ) గిరిజన ప్రాంతంలో ఆరోగ్యపరంగా, వాణిజ్య పరంగా ఎంతో ప్రాముఖ్యత కలిగింది. ఏజెన్సీ అడవుల్లో సహజంగా దొరికే ఈ అడ్డ చెట్టులోని అడ్డగింజలు ఆరోగ్యపరంగా కూడా ఎంతో మంచిది.

విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవితో పాటు పలు చోట్ల సహజంగా ఈ అడ్డ చెట్లు పెరుగుతాయి. ఈ అడ్డ చెట్లలోని అడ్డ ఆకులతో విస్తరాకులు, బెరడుతో తాళ్ళు, అడ్డ గింజలు ఇలా చెట్టులోని అన్ని భాగాలు ప్రతీ యేటా గిరిజనులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ ఆకులను, గింజలను, అడవుల నుంచి సేకరించి వారపు సంతల్లో విక్రయిస్తుంటారు. అడ్డగింజలతో కూర వండుకుంటారు. అడ్డ ఆకులతో యాంటీ ఆక్సిడెంట్స్ ఉండటంతో ఈ ఆకులలో తింటే ఆరోగ్యానికి మేలు చేకూరడమే కాక, జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని చెబుతుంటారు. అడ్డ గింజల్లో ప్రోటీన్, కాల్షియం ఇంకా ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది యాంటి డయబెటిక్ కావంతో షుగర్ బారిన పడకుండా కాపాడుతుంది. ఏజెన్సీలో ప్రతీ ఏటా నిర్వహించే సంక్రాంతి పండగా మూడురోజులలో ప్రాముఖ్యమైన సంక్రాంతి రోజున గిరిజన సాంప్రదాయంగా వండుకునే పులగం అన్నంలో ఈ అడ్డగింజలను వేసి దేవతలకు నైవేధ్యంగా పెడతారు. ఆ తర్వాత పులగం అన్నం వండుకుని అడ్డాకులలో బుజిస్తారు. కొన్ని ప్రముఖ దేవాలయాల్లో అడ్డాకులను ప్రసాదం ప్యాకింగ్‌కు నేటికి సాంప్రదాయంగా వాడుకోవడం విశేషం.

ఇదిలా ఉండగా అడ్డతో తయారయ్యే విస్తరాకుల ఉత్పత్తి తగ్గడంతో పేపర్ ప్లేట్ వాడటం పెరిగింది. పేపర్ ప్లేట్లు కూడా అంత పర్యావరణ అనుకూలమైనది కాదు. ఈ అడ్డతీగ ప్రాముఖ్యత అందరికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సహజంగా దొరికే ఈ అడ్డా ఆకులతో విస్తర్లుగా చేసి పేపర్ ప్లేట్లకు ప్రత్యామ్నయంగా వాడితే పర్యావరణనాకి ఎంతో బాగుంటుందని పలువురు మేధావులు, గిరిజనులు అభిప్రాయ పడుతున్నారు.

అడ్డపిక్కలు విక్రయిస్తున్న మహిళ

అడ్డ ఆకు, తీగలతో కలిగే ఉపయోగాలు :

- అడ్డాకులతో విస్తరాకులు చేయడం
- అడ్డ తీగలతో నారలు చేసి కంచెలు కట్టుటకు ఉపయోగించడం
- అడ తీగలతో బుట్టలు అల్లుకోవడం
- అడ్డగింజలను ఆహారం రూపంలో (స్నాక్స్) తీసుకోవడం.

ఎన్నో రకాలుగా వినియోగం

అడవిలోకి వెళ్లి అడ్డా కాయలు సేకరిస్తాం. ఇంటికి తీసుకొచ్చిన అడ్డ కాయలను కాల్చి లోపలి భాగంలో అడ్డపిక్కలను తీస్తాం. అడ్డపిక్కలతో కూర కూడా వండుకుంటాం. మార్చి, ఏప్రిల్ నెలల్లో కెజి రూ.100కు సంతల్లో విక్రయించి వచ్చిన డబ్బులతో జీవనం కొనసాగిస్తుంటాం.

ఎం.లక్ష్మి,
గడికించుమండ
పాడేరు మండలం

యుజెఎఫ్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ అధ్యక్షులు డాక్టర్ ఎంఆర్ఎన్ వర్మ ఆధ్వర్యంలో రూపొందించిన 2023-24 యూజెఎఫ్ హ్యాండ్ బుక్ అద్భుతంగా మలిచారని జిల్లా పౌర సంబంధాల అధికారి పి.గోవిందరాజులు కొనియాడారు. శోభక్రుత్ నామ సంవత్సర సందర్భంగా పాడేరు ఐటీడీఏ కార్యాలయం వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యూజెఎఫ్ 2023-24 హ్యాండ్ బుక్ ను డిపిఆర్ఓ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనం కోసం మనం అనే కాన్సెప్ట్ తో యుజెఎఫ్ రూపొందించిన డైరీలో ఉత్తరాంధ్ర జిల్లాలు, వాటి స్వరూపంతో పాటు ఆయా జిల్లాలోని మండలాల వారీగా జర్నలిస్టు మిత్రుల ఫోన్ నెంబర్లు ముద్రించడం అందరికీ ఉపయోగకరంగా ఉందన్నారు. అదేవిధంగా రాష్ట్ర క్యాబినెట్, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్‌ల నంబర్లను ముద్రించడం బాగుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుజెఎఫ్ సభ్యులు పి.సూర్యారావు, సునీల్, మత్స్యరాజు, డివిజనల్ పిఆర్ఓ పి.రాములు, ఏఐఇ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌టి మృతికి సంతాపం

ప్రజాశక్తి-పాడేరు: కర్నూలు జిల్లా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సిఆర్‌టిగా గత 10 సంవత్సరాల పాటు విధులు నిర్వహిస్తున్న రవినాయక్ గుండెపోటు తో మృతి చెందడం పట్ల సిఆర్‌టిల సంఘం రాష్ట్ర యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నూకరాజు గురువారం ఒక ప్రకటనలో సంతాపం వెలిబుచ్చారు. సంఘం తరపున సిఆర్టి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రవినాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేక ఎంతో మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-హుకుంపేట: అనారోగ్యంతో ఉపాధ్యాయుడు శోభ అర్జున్ మృతి చెందారు. డుంబ్రిగుడ మండలం దాతురు గ్రామ ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్న ఆయన గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం హుకుంపేట మండలం గత్తుం పంచాయతీ మండిపుట్టు. ఆయన మృతి పట్ల మాజీ జడ్పీటీసీ కిల్లో సురేంద్ర సంతాపం తెలిపారు. మాజీ జెడ్పిటిసి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ఉపాధ్యాయుని కుటుంబానికి ప్రభుత్వం నుంచే వచ్చే రాయితీలను ఇచ్చి ఆదుకోవాలన్నారు.

రోడ్డుపై నిలిచిన లారీ

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రం నుండి మద్దుగరువు వెళ్లే రహదారి మధ్యలో గుదళం వీధి గ్రామం వద్ద జియో, ఎయిర్ టెల్ టవర్ల నిర్మాణానికి తీసిన గోతుల్లో మట్టి, రాళ్లు రహదారిపై వేసి వదిలేస్తుండటంతో వాహన దారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం మద్దిగరువు గ్రామానికి సిమెంట్ తరలిస్తున్న లారీ మధ్య భాగంలో పెద్ద రాయి ఇరుకోవడంతో మలుపులో మూడు గంటల పాటు నిలిచి పోయింది. దీంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జియో టవర్లకు తీస్తున్న మట్టి, రాళ్లను రహదారిపై వేయకుండా అధికారులు చొరవ తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

అవస్థలు పడుతున్న వాహనదారులు

గురుకులం ప్రిన్సిపల్‌పై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అహ్మద్ అలీషాపై సస్పెన్షన్ వేటు పడింది. గతేడాది సెప్టెంబర్‌లో ఏడో తరగతి విద్యార్థి సాదల లోకేశ్వర్ రెడ్డి అనారోగ్యంతో మృత్యువాత పడిన సంఘటనలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నాడు ప్రిన్సిపల్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఈ ఘటనపై గిరిజన సంక్షేమ శాఖ నుండి విచారణ అధికారిని నియమించి దర్యాప్తు చేయించారు. ఈ విచారణలో ప్రిన్సిపల్ అహ్మద్ ఆలీషా విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ వహించకుండా, అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థిని తల్లిదండ్రుల చెంతకు పంపించకుండా అశ్రద్ధ చేయడంతో విద్యార్థి ఆరోగ్యం మరింత క్షీణించి మృత్యువాత పడినట్లు తేలింది. దీంతో ప్రిన్సిపల్‌ను సెస్పెండ్ చేస్తూ రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ ఘనోరే ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మన్యంలో ఆశ్రమ పాఠశాలలో ప్రిన్సిపల్స్, వార్డెన్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు భవితవ్యంపై శ్రద్ధ వహించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులను సంబంధిత ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ ఆదేశాలున్నా, వాటిని బేఖాతరు చేయడం సరికాదని పేర్కొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి- కూనవరం

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మండలంలో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం మండల నాయకులు గురువారం తహశీల్దారు అనసూయకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య మాట్లాడుతూ వర్షాల వల్ల వాణిజ్య పంటలైన మిర్చి, పొగాకు పంటలు బాగా దెబ్బతిన్నాయని తెలిపారు. 2022లో గోదావరి వరదల వల్ల రైతులు పంటలు ఆలస్యంగా వేయడం జరిగిందని, ఇప్పుడు పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు రావడం వల్ల మిర్చి, పొగాకు నష్టం జరిగిందని తెలిపారు. తడిసిన పంటను దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, అందువల్ల ఆ పంటను ప్రభుత్వమే తగిన ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం అధిక ధరలకు రసాయన పురుగు మందులు కొనుగోలు చేసి రైతులు అప్పుల పాలయ్యారని వాపోయారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. లేకుంటే రైతుల పక్షాన సిపిఎం పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, శ్యామల కృష్ణ, వెంకన్న, వీరబాబు, షణ్ముఖరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మారు మూల బూర్జ పంచాయతీ పాట్కదౌడ సరిహద్దు గ్రామాలకు రహదారి నిర్మాణానికి జడ్పీటీసీలు రేగం మత్స్యలిగం, దీసరి గంగరాజు, అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణిలు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం జడ్పీటీసీలు రేగం మత్స్యలింగం, దీసరి గంగరాజులు మాట్లాడుతూ, రెండు మండలాల సరిహద్దు గ్రామాలు ఏర్పడి సూమరు 80 ఏళ్ళ పై బడినా అభివృద్ధికి నోచుకో లేదన్నారు. అంతగిరి మండలం రాజపాక, దెక్కపూరం, హుకుంపేట మండలం పాట్కదౌడ గ్రామానికి మిషన్ కనెక్టివిటీ ఐటీడీఏ, పాడేరు ప్రోగ్రామ్ కింద రూ.2.40 కోట్ల వ్యయంతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని వారు తెలిపారు. గత కొద్ది ఏళ్ళుగా రహదారి సౌకర్యాలు లేక రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరోగ్య సమస్యలు వస్తే కనీసం అంబులెన్స్ కూడా రాని పరిస్థితిలో గిరిజనులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు..గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిధులు కేటాయించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకష్ణ, అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమెలి రూతు, ఎగుసోభ సర్పంచ్ సింహాద్రి, గెమ్మెలి అప్పారావు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, మత్స్యలింగం,

రోడ్డు వేయిస్తున్న సిహెచ్‌డబ్ల్యు

సొంత డబ్బులతో రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో జోలాపుట్ పంచాయతీ తోట గోడిపుట్ గ్రామం నుంచి లబ్బురు సిహెచ్‌కి రోగులకు ఆసుపత్రికి తీసుకు వెళ్లాలంటే అనేక కష్టాలు ఎదురవడంతో తమ సొంత నిధులతో మూడు కిలోమీటర్ల మట్టి రోడ్డును జెసిపి సహాయంతో నిర్మాణాన్ని చేపట్టారు. తోటగోడిపుట్ గ్రామంలో కనీస రవాణా సౌకర్యం లేకపోవడంతో 3 కిలోమీటర్లు కాలినడకన రోగులను డోలిలతో గర్భిణీలు ఆసుపత్రికి కాలినడకన వెళ్ళవలసిన దుస్థితి నెల కోవడంతో తమ సొంత నిధులతో రోడ్డు వేయాలని నిర్ణయించుకున్నట్లు సిహెచ్‌డబ్ల్యు తెలిపారు. సొంత నిధులు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని ఆవేదన వ్యక్త పరిచారు. సిహెచ్‌డబ్ల్యుగా విధులు నిర్వహించే ఆమెకు నెలసరి జీతం నాలుగు వేలు. భర్త వ్యవసాయం చేసి సమకూర్చిన డబ్బుతో పాటు ఆమె జీతం కూడా పెట్టి మట్టి రోడ్డును నిర్మాణం చేపట్టారు. గ్రామం నుండి ఆసుపత్రికి వెళ్లాలంటే అనేక ఇబ్బందులు గురవడంతో పాటు రోగులు వైద్యం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలంటే నిరాకరిస్తున్నారన్న ఉద్దేశంతోనే సొంత నిధులతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామంలో పర్యటిస్తున్న కిడారి శ్రావణ్‌కుమార్

నాలుగేళ్లలో అభివృద్ధి ఎక్కడ?

మాజీ మంత్రి కిడారి

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో అరడకోట పంచాయతీ నిమ్మగుంట గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి నాగేశ్వర్‌రావు అధ్వర్యంలో.ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి అరకు నియోజక వర్గం ఇంఛార్జి, మాజీ మంత్రి కిడారి శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథిగా.హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంతో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఇదేం ఖర్మ కార్యక్రమం దృష్టికి గిరిజనులు పలు సమస్యలు లేవనేత్తుతున్నారన్నారు. మంచినీటి, డ్రైనేజీ, సిసి రోడ్స్ లేని గ్రామాలు .అనేకం ఉన్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకత ఉందన్నారు. వైసీపీ గెలిచి నాలుగేళ్ళు అవుతుందని అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందాన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో .మాజి సర్పంచ్ తైసాబు త్రినాథ్, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజ్ కార్యదర్శి సాగర సుబ్బారావు, దారెల సర్పంచ్ పాంగి పాండు రంగస్వామి, అరకు పార్లమెంట్ రైతు సంఘం అధ్యక్షుడు భూషన్‌రావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఓఎల ధర్నా

ప్రజాశక్తి - రంపచోడవరం

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వెలుగు యానిమేటర్స్ ఎపిడి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీనికి ముందు సిఐటియు కార్యాలయం నుండి ఎపిడి కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా నాయకులు, కె.శాంతిరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈ.సిరిమల్లిరెడ్డి మాట్లాడుతూ వెలుగు యానిమేటర్స్ అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ప్రధానంంగా మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యూలర్ వల్ల విఓఎలు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ డ్వాక్రా సంఘాలను నడపడం కోసం పనిచేస్తున్నారని, అలాంటి వారికి రాష్ట్రప్రభుత్వం ఉద్యోగ భద్రతా కలిపించకుండా శ్రమ దోపిడీ చేస్తోందని విమర్శించారు. 20, 25 ఏళ్ల నుంచి పని చేస్తున్న వెలుగు యానిమేటర్స్ సుమారు 50 మంది సంవత్సరం కాలంగా వేతనాలు ఇవ్వకుండా తొలగించబడ్డారని, వారిని తక్షణమే యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం, కల్పించాలని, కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని, బకాయి పడ్డ మూడు నెలల వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అత్యవసర సమావేశాలకు టిఎ, డిఎలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వెలుగు ఎపిడికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో విఓఎ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు బషీరా, నాయకులు చంద్రశేఖర్, అధిక సంఖ్యలో విఓఎలు పాల్గొన్నారు.

ధర్నా అనంతరం వెలుగు ఎపిడికి వినతిపత్రం ఇస్తున్న విఓఎలు, సిఐటియు నాయకులు

ఏజెన్సీలో రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలి

సిపిఎం ఎంపిటిసి సభ్యులు బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు

గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అధికారులు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. అనుమతులు ఇవ్వకపోవడమంటే గిరిజన ప్రాంత అభివృద్ధిని అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడమే అవుతుందన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజనులు పూర్వం నుండి ప్రధాన రహదారులకు 10 నుండి 30 కిలోమీటర్ల దూరంలో అడవుల్లో పొడి వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తూ వస్తున్నారని తెలిపారు. వారు నిత్యవసర సరుకులు కొనుక్కోవాలంటే రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల ప్రభావం ఉండడం వలన మారుమూల ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు చేయలేకపోయామని గత ప్రభుత్వాలు చెప్పుకొచ్చాయని తెలిపారు. రహదారులు నిర్మిస్తే అడవులు నష్టపోతాయని ఇప్పుడు అటవీ శాఖ డిఎఫ్ఓ చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఏజెన్సీలోని అడవులు నష్టపోకుండా మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అధికారులు అడ్డంకుల వల్ల మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయాయని తెలిపారు. ఎప్పటికైనా అటవీశాఖ అధికారులు గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని, లేకుంటే గిరిజన ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు.

మాట్లాడుతున్న బుజ్జిబాబు

జోరుగా కోడి పందేలు

ప్రజాశక్తి మారేడుమిల్లి

మారేడుమిల్లి, వై రామవరం మండలాల్లోని ఎగువ ప్రాంతాల్లో ఉగాది పండగను పురస్కరించుకొని కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ యువకులు కోడిపందాలు, బెట్టింగుల్లో మునిగి తేలుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులకు తెలియకుండా జరుగుతుందా? లేక వారి కనుసన్నల్లోనే జరుగుతుందా అంటూ పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంత భారీ ఎత్తున పందేలు జరుగుతున్నా అధికారులకు చీమకుట్టినట్టు లేకపోవడంపై జూదరుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విఓఎలు

చిట్టెమ్మపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి -సీలేరు

జిల్లాలోని పాడేరు వెలుగు విఓఎ రమాదేవి, సీసీపై దాడికి పాల్పడిన వంతల చిట్టెమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం జికె.వీధి తహశీల్దారు కార్యాలయం ఎదుట విఓఎలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆర్ఐకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు, సిఐటియు మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ మాట్లాడుతూ రుణం రికవరీ కోసం వెళ్లిన వివోఏ, సిసిపై వంతల చిట్టెమ్మ దాడి చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విఓఎల యూనియన్ మండల అధ్యక్షుడు పాంగి చంటి మాట్లాడుతూ వివోఏ, సిసిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లోన్ రికవరీకి వెళ్లిన విఓఎలపై గతంలో చాలా ప్రాంతాల్లో లబ్ధిదారుల నుండి అనేక ఒత్తిళ్లు వచ్చాయని తెలిపారు. అయినా ఓర్పుతో లోన్ రికవరీలు చేస్తున్నామని చెప్పారు. దాడికి పాల్పడిన చిట్టెమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు మురళి చంటిబాబు, సిసిలు, వివోఏలు పాల్గొన్నారు.

రహదారిపై నేలకొరిగిన వృక్షం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని ఉల్లాకులపాడు గ్రామ శివారులో రహదారిపై గురువారం వృక్షం నేలకొరిగింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చేరుకుంపాలెం పంచాయతీ ఊర్లకులపాడు, బోర్నగూడెం గ్రామాల మధ్య అటవీ ప్రాంత సమీపంలో ఏలేశ్వరం, రాజవొమ్మంగి ప్రధాన రహదారిలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు భారీ వృక్షం చెట్టుకొమ్మలు రహదారిపై పడ్డాయి. దీంతో ఏలేశ్వరం నుంచి వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక యువకులు సంఘటన స్థలానికి చేరుకొని కోత మిషన్ల సహాయంతో చెట్టు కొమ్మలను తొలగించడంతో ట్రాఫిక్ సమస్య తీరింది.

గర్భిణులు, పిల్లలకు టీకాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చిట్టెంపాడు పంచాయితీ గోపవరం గ్రామంలో డౌనూరు పిహెచ్‌సి ఏఎన్ఎం దేవుడమ్మ గురువారం బాలింతలు, గర్భిణులు, పిల్లలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ పాడి ధారలక్ష్మి, ఆశా వర్కర్ లక్ష్మీ, బాలింతలు, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో మారుపూజ

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రంలో సమీపంలో వెలసిన నూకాలమ్మ ఆలయంలో మారు పూజ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది కొత్త అమావాస్య రోజు ప్రధాన పండగ నిర్వహించి అనంతరం మారుపూజ నిర్వహిస్తుంటారు. అదే తరహాలో ఈ ఏడాది కూడా మారు పూజ సందర్భంగా నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అమ్మవారికి మొక్కుబడి రూపంలో వచ్చిన చీరలను కమిటీ సభ్యులు వేలంపాట నిర్వహించారు. ఆసక్తిగల భక్తులు వేలంపాటలో పాల్గొని 100 నుంచి 200 రూపాయల వరకు వేలంపాటలో చీరలు దక్కించుకున్నారు.

పోరాటయోధుల బాటలో నడుద్దాం

స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు,సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతిని అల్లూరిజిల్లాలో సిపిఎం, అనుబంధ ప్రజాసంఘాలు గిరిజన సంఘం, సిఐటియు డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ,ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదామని ప్రతిజ్ఞ చేశారు.
ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

- భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా సిపిఎం, ప్రజాసంఘాల ఘన నివాళి
- స్వాతంత్ర్య యోధుల స్ఫూర్తిని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ

చింతూరులో...

కూనవరంలో...

విఆర్.పురంలో..

రంపచోడవరంలో...

ప్రజాశక్తి- చింతూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ సానుకూల ధోరణులపై రాజీ లేని పోరాటాలు చేయడమే స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. గురువారం గూడూరు, దేవరపల్లి, గొడ్లగూడెం, అల్లిగూడం గ్రామశాఖల ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి దేశాన్ని, దేశ సంపాదను విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు తాకట్టు పెడుతోందని విమర్శించారు. మతతత్వాన్ని రాజేస్తూ దేశంలో చిచ్చుపెట్టి ప్రజల సంపాదను లూటి చేస్తోందని, రాజ్యాంగంపై దాడి చేస్తూ ప్రజాస్వామ్య, పౌర హక్కులు కాలరాస్తోందన్నారు. ఈ నేపథ్యంలో భగత్‌సింగ్ స్ఫూర్తి నేటియువత, ప్రజలకు ఆదర్శం కావాలని, ప్రజాకంటక పాలనపై పోరు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దేశంకోసం, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పొడియం లక్ష్మణ్, రమేష్, శేషు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, రఘు, జ్యోతి, భీమయ్య, రాధిక, సురేష్, ముత్తయ్య పాల్గొన్నారు.

కూనవరం : స్థానిక సిపిఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా పోరాటవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ, మహావీరుల పోరాటతత్వం అలవరుచుకుని, వారి అడుగుజాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, పార్టీ మండల కార్యదర్శి. పాయం సీతారమయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, తాళ్ళూరి శ్రీనివాస్, శ్యామల, కృష్ణ, షణ్ముఖరావు, బాబు, వెంకన్నబాబు, జయసుధ, వెంకన్నబాబు, రామారావు పాల్గొన్నారు...

విఆర్ పురం : రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన బాటలో నడుద్దామని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో గూటాల శ్రీనివాసరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహిచారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశాన్ని, ప్రజాసంపదను రక్షించేందుకు యువత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కంభం శాంతిరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, పలు సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో డివైఎఫ్‌ఐ మండల కార్యదర్శి టి.శ్రీను ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ, చేతి వత్తుదారులు సమన్వయ కమిటీ, ఇతర ప్రజాసంఘాల ప్రతినిధులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు, కార్యక్రమంలో ఎంఇఒ తాతబ్బాయిదొర, ఉపాధ్యాయులు శ్రీను, నాని, డివైఎఫ్‌ఐ నేతలు గణేష్, లక్ష్మీ నరసింహ, ఉమ శ్రీనివాసరావు, చేతి వత్తిదారుల సమన్వయ కమిటీ నేతలు నాయుడు, రాంబాబు, భద్రం, సత్తిరాజు విద్యార్థులు గోపి, సన్నీ, పండు, రవి పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు పి బాలదేవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో.గిరిజన హక్కులు, చట్టాల రక్షణకు గిరిజన యువత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, ఎస్ఎఫ్ఐ అరకు గర్ల్స్ కన్వీనర్ కె.ధనలక్ష్మి, గిరిజన సంఘం నాయకులు కె రామారావు, కె.జగన్నాథం, వి.దాసు, సిఐటియు నాయకులు కె.మగ్గన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు జి హరి, కృష్ణ, కె.శాంతి, కొండమ్మ, బలరాం పాల్గొన్నారు.

పెదబయలు : సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పార్టీ జిల్లా కమిటీ.సభ్యుడు బోండా సన్నిబాబు, వైస్‌ప్రెసిడెంట్ బోండా గంగాధరం చెందా రామారావు నివాళులర్పించారు.

ముంచింగిపుట్టు: స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన సంఘం, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ చిత్రపటాలకు నివాళులర్పించారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను, మాట్లాడుతూ బ్రిటిషర్ల దోపిడి, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడి, చిరుప్రాయంలోనే ఉరికంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాటస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకు,. 32మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న విశాఖ ఉక్కును పరిరక్షణ పోరాడదామని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె నర్సయ్య, సిపిఎం మండల కార్యదర్శి పి భీమరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు పి వరహాలబాబు, పి పాపారావు, ఐద్వా నేతలు ఈశ్వరి, విజయలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

రాజవొమ్మంగిలో..

అరకులో..

పెదబయలులో...

బందవీధి బడికి పూరిపాకే గతి!

- పాతికేళ్లయినా పాఠశాలకు పక్కా భవనం లేదాయే..!
- ప్రభుత్వాలెన్ని మారినా, పథకాలెన్ని వచ్చినా ఫలితం శూన్యం
- ఆవేదన చెందుతున్న గిరిజనులు.. పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి -సీలేరు: గూడెం కొత్తవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బందవీధి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను నెలకొల్పి పాతికేళ్లయినా నేటికీ పక్కా భవనం సమకూరని పరిస్థితి ఉంది. గతంలో ఒకసారి అరకొర నిధులు మంజూరు కావడంతో అర్థాంతరంగా నిర్మాణం నిలిచిపోగా, ఆ తర్వాత ఈ పాఠశాల దుస్థితిని పట్టించుకునే నాధులే లేకుండా పోయారు. దీంతో గ్రామస్తులు శ్రమదానంతో నిర్మించిన తాత్కాలిక పూరిపాకలోనే నేటికీ పాఠశాలను నిర్వహిస్తున్నారు.

బందవీధి పాఠశాల నిర్వహిస్తున్న పూరిపాక ఇదే

జికె.వీధి మండలం, దుప్పిలివాడ పంచాయతీ బందవీధిలో 1998లోనే పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 24మంది విద్యార్థులున్నారు. పాఠశాల ఏర్పాటై పాతికేళ్లయినా నేటికీ పక్కా భవనం లేదు. దీంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా నిర్మించిన పాకలోనే విద్యాబోధన సాగుతోంది. దాదాపు పుష్కరకాలం క్రితం సర్వశిక్ష అభియాన్ లో పాఠశాల భవనానికి రూ.12 లక్షల నిధులు మంజూరయ్యాయి. రెండు గదులతో పక్కా భవన నిర్మాణం ప్రారంభించినా, తర్వాత నిధులు సరిపోవన్న నెపంతో సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణం కొనసాగించలేదు. సకాలంలో పాఠశాల భవనం నిర్మాణం చేపట్టకపోవడంతో మంజూరైన నిధులు వెనక్కి పోయాయి. తర్వాత అధికారులుగానీ, నేతలుగానీ దీనిపై దృష్టి సారించకపోవడం, పాఠశాల భవన నిర్మాణానికి చొరవ చూపకపోవడంతో నేటికీ పూర్తికాని దుస్థితి.

12 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టి, మొండిగోడలతో వదిలేసిన పాఠశాల భవనం

స్వచ్ఛందంగా నిర్మించిన పాకలోనే పాఠశాల నిర్వహణ

బంధవీధి పాఠశాలకు నేటికీ సొంత భవనం సమకూరని పరిస్థితుల్లో, పాఠశాల నిర్వహణకు మరే ప్రత్యామ్నాయం కానరాక గ్రామస్తులు స్వచ్ఛందంగా పాకను నిర్మించారు. ఎండ ఎక్కువైనా, పెద్దగాలి వీచినా, చివరకు చిరుజల్లులు కురిసినా ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉన్నా, కొన్నేళ్లుగా ఇలాంటి పాకలోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఏటా పాఠశాల పాకకు పైకప్పు బాగుచేయడం భారంగానే ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అయితే గత్యంతరం లేని పరిస్థితుల్లో పిల్లల ఇబ్బందులు చూడలేక, వారిని చదువుకు దూరంచేయకూడదనే భావనతోనే ఇన్నాళ్లుగా గ్రామస్తులే సొంతంగా ఒక పాకను నిర్మిస్తూ వస్తున్నామన్నారు. కానీ ఈ ఏడాది ఆ పూరిపాకకు సైతం పైకప్పు వేయలేని పరిస్థితుల్లో టార్పాలిన్లను కప్పి, తాత్కాలిక గూడు కల్పించారు. నాడునేడు నిధులతో అన్ని పాఠశాలలను అభివృద్ధి చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో బందవీధి పాఠశాలను అధికారులు, నేతలు ఎందుకు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నచోట పాఠశాలలకు రంగులు వేయడం కాకుండా, బందవీధి వంటి భవనం లేని పాఠశాలలకు వసతి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ గిరిజనులు వేడుకుంటున్నారు.

మందుబాబులకు అడ్డాగా

అరకు గృహ నిర్మాణ కార్యాలయం..

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకువేలి మండలం కేంద్రంలోని గహ నిర్మాణ శాఖ కార్యాలయం ఎపుడూ తాళాలు వేసే దర్శమిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హౌసింగ్ పనుల కోసం కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులకు పడిగాపులు, ఎదురుచూపులు తప్పడం లేదు. ఎపుడూ గృహనిర్మాణ కార్యాలయానికి తాళాలు వేసి ఉండడంతో మందుబాబులకు అడ్డాగా మారిందనడానికి కార్యాలయ పరిసరాలు, ఆవరణలోని పరిస్థితులే నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. మందుసీసాలు, ఎంగిలి ఆకులు, చెత్తాచెదారంతో నిండిఉన్న గృహనిర్మాణ కార్యాలయం దుస్థితిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

తాళాలు వేసి ఉన్న అరకు హౌసింగ్ కార్యాలయం

తాజాగా గురువారం మధ్యాహ్నం 12 గంటలు దాటినా అరకువేలీలోని హౌసింగ్ కార్యాలయం తాళాలు వేసే కనిపించింది. కొన్నాళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో అసలు ఇక్కడ కార్యాలయం ఉందా? లేక ఎత్తేశారా? లేకుంటే ఇంకెక్కడికైనా తరలించారన్న అనుమానాలు వ్యక్తం కావడంతోపాటు పనులమీద వచ్చి లబ్ధిదారులు దీనిపై వాకబు చేయడం కనిపించింది. అరకువేలీ హౌసింగ్ కార్యాలయంలో ఉద్యోగులు,సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, వారు ఎపుడొస్తారో? ఎంతసేపు ఉంటారో? అసలు వస్తారో, రారో అన్న పరిస్థితులు ఉండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించడం కోసం ఫేషియల్ రికగ్నైజేషన్ యాప్, బయోమెట్రిక్ హాజరు వంటి ఎన్నో విధానాలను ప్రభుత్వం అమలు చేస్తున్నప్పటికీ, అరకువేలీలోని హౌసింగ్ ఉద్యోగులకు ఇవేవీ పట్టవా అని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అందరికీ వర్తించే నిబంధనలే ఇక్కడ అరకులేవీలోని హౌసింగ్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బందికి ఇవేవీ పట్టవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. హౌసింగ్ యంత్రాంగం సమయపాలన పాటించకపోవడం, అసలు కార్యాలయాన్నే తెరిచే పరిస్థితి లేకపోవడంతో ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చే లబ్ధిదారులు ఎంతటి ఇబ్బందులు పడతారో ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు గుర్తెరిగి స్పందించాలని, సమయపాలన పాటించక ఇబ్బందులకు గురిచేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై సంబంధిత అధికారుల వివరణ, స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

కార్యాలయ ఆవరణలో ఖాళీమందు సీసాలు, ఎంగిలి ఆకులు

మోకాళ్లపై నిల్చున్నా..

రోడ్డు సౌకర్యం గగనమేనా..?

- అరణ్యరోదనగానే నిమ్మలగొంది గిరిజనం గోడు
- స్వచ్ఛందంగా నిర్మించిన రోడ్డును పటిష్ట పరచాలని వినతి
- అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా పట్టని వైనం
- రోడ్డు లేకపోవడంతో అన్ని సౌకర్యాలూ దూరమేనని ఆవేదన

ప్రజాశక్తి - కొయ్యూరు : జిల్లా, మండల కేంద్రానికే కాదు... పంచాయతీ కేంద్రానికి సైతం సుదూరంలో, ఎత్తైన భారీ కొండల మధ్య ఉన్న గిరిజన గ్రామం అది...ఇటు సొంత మండల కేంద్రం కొయ్యూరుకుగానీ, మరోవైపున్న జికె.వీధి మండలానికి సైతం అందనంత దూరంలో, అందుబాటులో లేని పరిస్థితి. కొండకోనల మధ్య ఉన్న ఆ గ్రామానికి ఎన్నికలప్పుడు తప్ప, ఇతరత్రా సందర్భాల్లో ఏ నాయకుడుగానీ, అధికారిగానీ సందర్శించిన దాఖలాలు లేవు. ఇలా అన్నింటికీ దూరంగా ఉన్న తాము, అందరికీ చేరువ కావాలంటే సరైన రహదారి సౌకర్యం ఉంటే సాధ్యమని ఆ గ్రామస్తులు వేడుకుంటున్నారు. తమ గ్రామానికి కనీసం మెటల్ రోడ్డు అయినా నిర్మించాలని ఏళ్ల తరబడి మొరపెట్టుకుంటూనే ఉన్నారు. అయితే ఎన్నాళ్లయినా, వారి వేదన అరణ్యరోదనగానే మిగిలిందే తప్ప ఏ ఒక్కరూ పట్టించుకున్న పరిస్థితి లేదు.దీంతో రోడ్డు సౌకర్యం కల్పించాలని మోకాళ్లపై నిలుచుని, తల్లకిందులుగానూ నిరసన వ్యక్తంచేశారు. అయినా తమగోడును ఆలించే నాధులే కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు. కొయ్యూరు మండలం మర్రిగొండ పంచాయతీ, నిమ్మలగొంది గిరిజన గ్రామ ప్రజల రహదారి కష్టాలపై కథనం.

కొయ్యూరు మండలం, మర్రివాడ పంచాయతీ, నిమ్మలగొంది గ్రామం అటుమండలకేంద్రంతోపాటు, ఇటు పంచాయతీ కేంద్రానికి సుదూరంలో, కొండప్రాంతంలో ఉంది. నిమ్మలగొంది గ్రామం నుంచి పంచాయతీ కేంద్రానికి వెళ్లాలంటే, బి.కొత్తూరు మీదుగా పెద్ద పెద్దకొండలు దాటాల్సిందే. ఈ మార్గంలో గుండా రోడ్డు నిర్మాణం ఇప్పట్లో దాదాపు అసాధ్యమని చెప్పకతప్పదు. ఇటువంటి పరిస్థితుల్లో నిమ్మలగొంది గ్రామ గిరిజనులు, తామున్న కొండలకు రెండోవైపున ఉన్న గూడెంకొత్తవీధి మండలం వైపు రోడ్డు సౌకర్యం కల్పిస్తే ఎటైతేనేం అత్యవసరానికి మైదానానికి వచ్చే వీలుంటుందని భావించి, తమ గోడును అధికారులు, నేతలకు అనేకమార్లు విన్నవించారు. అయితే ఏ ఒక్కరూ పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం

తమ గోడును ఎవరూ పట్టించుకోని పరిస్థితుల్లో నిమ్మలగొంది గిరిజనులు, విరాళాలను సేకరించి, శ్రమదానంతో కొక్కితపాడు వరకు మట్టిరోడ్డు నిర్మించుకున్నారు. ఈ మార్గం గుండా రంపుల గ్రామానికి చేరుకుంటే, అక్కడ నుంచి పంచాయతీ కేంద్రం మర్రిగొండకుగానీ, మండల కేంద్రం కొయ్యూరుగానీ వెళ్లే వీలుంటుందని భావించి రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు.

వేసిన రోడ్డు పటిష్టం చేయాలని వినతి

కొక్కితపాడు వరకు స్వచ్ఛందంగా తాము వేసుకున్న రోడ్డును పూర్తిరూపు కల్పించి పటిష్టం చేస్తే ప్రయోజనకరంగా ఉంటుదని అనేకసార్లు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు

తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని మోకాళ్లపై నిలుచుని వేడుకొంటున్న నిమ్మలగొంది గిరిజనులు

వినతులు సమర్పిస్తూనే ఉన్నారు. తమగోడు అధికారులు, నేతల దృష్టికి వెళ్లాలని ఇటీవల గ్రామగిరిజనులంతా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కొంతమంది యువకులు తలకిందులా ఉండి ఆందోళన వ్యక్తం చేశారు. అయినా ఎటువైపు నుంచి ఎలాంటి స్పందన లేదని ఆవేదన చెందుతున్నారు.

రోడ్డు లేక అన్ని సౌకర్యాలూ దూరమే...

తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నిత్యవసరమైన తాగునీరుతోపాటు అత్యవసరమైన వైద్యసౌకర్యం ఇలా అన్నీ దూరమై మోడువారిన బతుకులతో జీవనం వెల్లదీస్తున్నామని నిమ్మలగొంది గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

ఎమ్మెల్యే, ఇతర నేతలు స్పందించాలి...

తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పనపై పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిగానీ, ఎంపిపి బడుగు రమేష్‌బాబు, జెడ్‌పిటిసి వారా నూకరాజు, ఇంకా మరేయితర నేతలపై పట్టించుకుని రోడ్డు సమస్యలను పరిష్కరించాలని నిమ్మలగొంది వాసులు వేడుకుంటున్నారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలు దృష్టిసారించాలని ప్రాధేయపడుతున్నారు. మోకాళ్లపై నిల్చోవడం, తల్లకిందులా తపస్సులా నిరసన వ్యక్తం చేసినా అధికారులు, నేతలెవరూ స్పందించని పరిస్థితుల్లో.. ఇంకేం చేస్తే అందరిలో కదలిక వస్తుందో తెలియడం లేదని వారంతా ఆవేదన చెందుతున్నారు గిరిజన సంక్షేమానికి కోట్లాది నిధులు వెచ్చిస్తూ, ఏదో చేసేస్తున్నామని ప్రకటనలిస్తున్న వారికి తమ నిమ్మలగొంది గ్రామం కనిపించడం లేదాయని ప్రశ్నిస్తున్నారు. నేతలు, అధికారులకు పదేపదే మొరపెట్టుకుని విసిగి, వేసారిపోయిన వీళ్లంతా తమకీ జన్మలో రోడ్డు సౌకర్యం కల్పించరన్న నైరాశ్యంలోకి వెళ్లిపోతున్నారు. తమ బతుకులింతేనా అని వాపోతున్నారు. తమకు రోడ్డు సౌకర్యం కల్పనకు చొరవ చూపిన వారికి జీవితాంతం రుణపడి ఉంటామని వేదాంతధోరణితో చెబుతున్నారు.

బాలికల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో సిడిపిఒ ఎం.రాజేశ్వరి అధ్వర్యంలో 'భేటీ బచావో భేటీ పడావో' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు రక్తహీనత, బాల్యవివాహాలు పోషక ఆహారంపై వివరించారు. బాలికల సంక్షేమమే లక్ష్యంగా పోషణ పక్వాడా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. బాల్య వివాహాలతో అనర్థాలు కలుగు తాయన్నారు. బాలింతలు పూర్తి స్థాయిలో పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం హాస్టల్ వార్డెన్‌లు, మేట్రిన్లు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. రక్త హీనత లేకుండా చూడాలన్నారు. కేజీబివి పాఠశాల నుండి పెట్రోల్ బంక్ వరకు అవగాహన ర్యాలీ చేశారు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎల్.పూర్ణయ్య, ఎంఇఒ కె.సింహచలం వైస్ ఎంపిపి కొర్ర రాజుబాబు పాల్గొన్నారు.

పెదబయలులో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

పాత్రికేయుల హర్షం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో పాత్రికేయులను గుర్తించి ఉగాది సందర్భంగా సన్మానించిన సేవా ట్రస్ట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు కీరసాని రామదాసుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాత్రికేయుల మండల అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ, మండలంలో జరుగుతున్న అక్రమాలను వెలికితీసి సమాజానికి తెలియపరుస్తున్న పాత్రికేయులకు గుర్తించడం సంతోషకరంగా ఉందని అన్నారు. కిరసాని శ్యామ్ సుందరం సేవా సంస్థతో గిరిజన ప్రాంతంలో వెనుకబడిన, వయోవృద్ధులకు, తల్లిదండ్రులు తన వంతు సహాయం చేస్తున్నారని అన్నారు.

తారల క్రికెట్ పోటీలకు సర్వం సిద్ధం

- నేడు, రేపు సెలబ్రిటీ క్రికెట్ లీగ్
- 24న సెమీఫైనల్స్, 25న ఫైనల్
- పిఎం.పాలెం స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణ

ప్రజాశక్తి, ఎంవిపి కాలనీ : సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సిసిఎల్) 2023 లీగ్ సెమీఫైనల్స్, ఫైనల్స్ పోటీలు ఈ నెల 24, 25 తేదీల్లో విశాఖలోని విసిఎ,ఎడిసిఎ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ నెల 24న మధ్యాహ్నం 2.30గంటలకు ముంబై హీరోస్, భోజ్పురి దబ్బంగ్స్ మధ్య మొదటి సెమీఫైనల్, రాత్రి 7గంటలకు తెలుగు వారియర్స్ - కర్ణాటక బుల్డోజర్స్ మధ్య జరగనుంది. ఫైనల్ పోటీ ఈ నెల 25న జరగనుంది. ఈ సందర్భంగా సెలబ్రిటీ క్రికెట్ లీగ్ స్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ ఇందూరి మాట్లాడుతూ సిసిఎల్ -2023కు పోటీలకు సర్వం సిద్ధమైందన్నారు. ఈ టోర్నీకి వస్తున్న స్పందనపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో ప్రతి ఇన్నింగ్స్‌లో పది ఓవర్లు చొప్పున 20ఓవర్లు మ్యాచ్ సాగేలా కొత్త ఫార్మెట్‌ను రూపొందించామన్నారు. సినీ స్టార్లు అద్భుతమైన క్రికెట్ నైపుణ్యాలను ప్రదర్శించడం, మధ్యలో వినోదభరిత సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయన్నారు. సిసిఎల్ మ్యాచ్‌లను జీ నెట్‌వర్క్‌లోని ఆరు వేర్వేరు ఛానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు.